ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5

వనపర్తి
జిల్లా వార్తలు
శుక్రవారం 7 జూన్ 2024

ప్లాస్టిక్ నిషేధం

- అమ్రాబాద్ అభయారణ్యంలో కఠిన నిబంధనలు
- పెద్ద పులులు, ఇతర వన్యప్రాణులకు హాని కలుగకుండా చర్యలు
- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న అటవీశాఖ



మన్ననూర్, జూన్ 6: అమ్రాబాద్ అభయారణ్యంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని క్రమేపీ తగ్గించడంపై అటవీ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించి, పలురకాల పర్యావరణ హిత కార్యక్రమాలను చేపడుతోంది. నల్లమల పులుల అభయారణ్య ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధించేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాజాగా జీవో జారీ చేశారు. ఆ ఆదేశాలను అమలు చేసేందుకు అధికారులు కసరత్తును ప్రారంభించారు.

ప్లాస్టిక్‌తో వన్యప్రాణులకు హాని..

అభయారణ్య ప్రాంతం 2,166 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. అడవిలో 25 పెద్ద పులులు, 170 చిరుత పులులు, జింకలు, సాంబర్లు, మనుబోతు, అడవి పందులు, నెమళ్లు, మూషిక జింకలు, అడవి కోళ్లు, అడవి కుక్కలు, అడవిపిల్లి, ఎలుగుబంట్లు కలిపి 2000లకు పైగా ఉన్నట్లు అటవీశాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇటీవల పెద్ద పులులు, చిరుతల సంఖ్య పెరిగింది. పెద్ద పులులకు ఆహారం కోసం సరిపడా జంతువుల సంఖ్య ఉందా?.. లేకుంటే ఎంత మేర పెంచాలో తెలుసుకునేందుకు మే నెలలో మూడు రోజుల పాటు అన్ని బీట్లలో ఎకలాజికల్ సర్వే చేపట్టారు. ప్లాస్టిక్ వలన వన్య ప్రాణులకు ఎంతో ప్రాణహాని ఉందని అటవీ అధికారులు గుర్తించారు. అడవి గుండా ఉన్న రహదారులు దాటే క్రమంలో పర్యాటకులు ప్లాస్టిక్ వస్తువులను, నీళ్ల సీసాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వదిలివేయడం వలన శాకాహార జంతువులైన జింకలు, సాంబారు, కణితి వంటివి వాటిని తినడం వల్ల జీర్ణకోశ సమస్యలు వచ్చి.. ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు గుర్తించారు. అందుకే ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

అమ్రాబాద్ అడవుల్లో ప్లాస్టిక్ నిషేధానికి ఇప్పటికే పలు రకాల కార్యక్రమాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు, మద్దిమడుగు, దోమలపెంట వరకు రహదారులపై పర్యాటకులు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర తినుబండారాల కవర్లను వదిలి వెళ్తున్నారు. వాటిని నిత్యం ఒక దగ్గరికి చేర్చేందుకు అటవీ శాఖ స్థానికంగా ఉండే ఎనిమిది మంది సిబ్బందిని నియమించింది. ఈ వ్యర్థాలను మన్ననూరు వద్ద ఉన్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రానికి చేర్చుతారు. అక్కడి సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి, రీసైక్లింగ్ యంత్రంలో వేసిన తర్వాత కట్టలు కట్టి, హైదరాబాద్‌లోని సెంటర్‌కు తరలిస్తారు. ఈ సిబ్బంది వేతనాల కోసం ఎనిమిదేళ్లుగా మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద అటవీశాఖ టోల్‌గేట్లను ఏర్పాటు చేసింది. పర్యాటకుల వాహనాల నుంచి మెయింటెనెన్స్ చార్జీల రూపేణ టోల్ ఫీజులను వసూలు చేసి, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో ప్రత్యామ్నాయంగా జనపనార సంచులు, పర్సులు, కూరగాయల బ్యాగులు, అడవిలో లభించే మార్పుటాకులతో పర్యావరణహిత టిఫిన్, భోజనం ప్లేట్ల తయారీ కేంద్రాన్ని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ నిర్వహిస్తోంది. సఫారీ టూర్‌కు వచ్చిన పర్యాటకులకు ఈ పర్యావరణ హిత వస్తువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. మున్ముందు పావు, అర లీటరు ప్లాస్టిక్ నీటి బాటిళ్లు మన్ననూరు నుంచి తీసుకెళ్లకుండా నిషేధం విధించి, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ఉన్నతాధికారులతో సమాలోచనలు చేస్తున్నారు.


రీసైక్లింగ్ కేంద్రంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ వాడకం తగ్గేలా చర్యలు



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు నల్లమలలో జూలై ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధంపై కఠిన నిబంధనలు విధించనున్నాం. ప్లాస్టిక్ సీసాలతో పాటు తినుబండారాల కవర్లను అడవిలో వదలకుండా మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టు వద్ద పర్యటకులకు అవగాహన కల్పిస్తాం. మన్ననూరు, మద్దిమడుగు, వటవర్లపల్లి, దోమలపెంట తదితర గ్రామాల్లోని హోటళ్లు, దాబాలు, దుకాణాల యజమానులకు సైతం ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన కల్పిస్తాం. పర్యావరణహిత ప్లేట్లు, కప్పులను ఉమామహేశ్వరం, మద్దిమడుగు, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో ప్రసాదాల పంపిణీకి వాడేలా చర్యలు చేపడతాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో ఉపాధి



ప్లాస్టిక్ వ్యర్థాలైన బాటిళ్లు, కవర్లు, సీసాలు రహదారి పొడవునా సేకరించి మన్ననూరులోని రీసైక్లింగ్ కేంద్రానికి తరలిస్తున్నాం. ఆ కేంద్రంలో యంత్రాల ద్వారా 10 కిలోలకుపైగా బరువు ఉండేలా వ్యర్థాలను కట్టలు కట్టి, హైదరాబాద్‌లోని కేంద్రానికి తరలిస్తున్నాం. అమ్రాబాద్ అభయారణ్యంలో ప్లాస్టిక్ రహిత కార్యక్రమాల వల్ల ఎనిమిది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

- సతీష్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రం నిర్వాహకుడు


మన్ననూరులోని పర్యావరణ హిత టోల్‌గేట్ (అటవీ చెక్‌పోస్టు)


అడవిలో ప్లాస్టిక్ బాటిళ్లను సేకరిస్తున్న అటవీశాఖ వలంటీర్లు


అలంపూర్ : ప్రభుత్వ కళాశాల చుట్టూ నిలిచిన వరద నీరు

స్తంభించిన జనజీవనం

- భారీ వర్షానికి జలమయమైన రోడ్లు, కాలనీలు
- పిడుగుపాటుకు మహిళ మృతి


పాలమూరులో మినీ ట్యాంక్‌బండ్ రహదారిపై నిలిచిన వర్షం నీరు

మహబూబ్‌నగర్/అలంపూరు/వెల్దండ/ ఉప్పునుంతల, జూన్ 6 : ఉమ్మడి పాలమూరు జిల్లాను వర్షం ముంచెత్తింది. గురువారం మధ్యాహ్నం కురిసిన వానకు పాలమూరులో జనజీవనం స్తంభించిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. వాతావరణం మేఘావృతమవడంతో చీకటి అలుముకున్నది. మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. బుధవారం రాత్రి, గురువారం కురిసిన వానతో మినీ ట్యాంక్‌బండ్ రహదారి వర్షపు నీటితో నిండి నీరు ఫుట్‌పాత్‌పైకి చేరింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. అలంపూరు పట్టణంలో అక్బర్ పేట కాలనీలో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలు జలమయమయ్యాయి. వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డివాముల చుట్టూ నిలిచాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ నీరు చేరడంతో దీవిని తలపించింది. కళాశాల ప్రాంగణం పూర్తిగా జలమయమైంది.


ఉప్పునుంతలలో పిడుగు పడి మృతి చెందిన ఎద్దు

వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గురువారం పిడుగుపాటుకు గురై కొమ్మరెక్క జంగమ్మ (45) మృతి చెందగా, ఆమె భర్త కృష్ణయ్య గాయపడ్డాడు. కృష్ణయ్య తన భార్య జంగమ్మ, అత్త జంగిలి ఈదమ్మతో కలిసి తన వ్యవసాయ పొలంలో పత్తిగింజలు నాటుతుండగా ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో జంగమ్మ అక్కడికక్కడే మృతిచెందగా భర్త కృష్ణయ్య గాయపడ్డాడు. అత్త తృటిలో ప్రాణాపాయంనుంచి తప్పించుకుంది. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కృష్ణయ్యను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఉప్పునుంతలలో సూరం రాజేందర్‌రెడ్డి బుధవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద ఎద్దును కట్టేశారు. రాత్రి కురిసిన గాలి వానలలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల విలువ ఉంటుందని బాధితుడు వాపోయాడు.


అలంపూర్ : అక్బర్ పేటలో ఇంట్లోకి చేరిన వరద నీరు

అలంపూరులో ఎత్తిపోయని మోటార్లు..

ఎత్తిపోతల ద్వారా వరద నీరు, మురుగు నీటిని ఎత్తి పోసే మోటార్లు పనిచేయకపోవడంతో వీధులలో నీరు నిలుస్తోందని, ఇళ్లలోకి నీరు చేరుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమస్యలపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వివరించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలను దృష్టిలో ఉంచుకుని త్వరగా పరిష్కరించాలని చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


అలంపూర్ : ఎత్తిపోతల మోటార్ల వద్ద నిండిన వరద నీరు

లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

- రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలి
- వనపర్తి జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి

వనపర్తి రూరల్, జూన్ 6: రైతులు అధిక దిగుబడులు సాధించి లాభసాటి వ్యవసాయం చేసే విధంగా అవగాహన కల్పించాలని జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి సూచించారు. గురువారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన 3,4వ స్థాయీ సంఘాల సమావేశాలకు జడ్పీ చైర్మన్ అధ్యక్షత వహించారు. మూడవ స్థాయీ సంఘం సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖలపై చర్చించారు. నాలుగవ స్థాయీ సంఘం సమావేశంలో విద్య, వైద్యంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో చాలా సారవంతమైన భూములు, వ్యవసాయానికి అనువైన వాతావరణం ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకుని రైతులు అధికదిగుబడితో పాటు లాభసాటి వ్యవసాయం చేసేవిధంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. యువత ఆధునిక సాంకేతికతో లాభసాటి వ్యవసాయం చేసే విధంగా ఇప్పటి నుంచే చొరవ తీసుకోవాలని సూచించారు. అయిల్ పామ్, పప్పు ధాన్యాలు, కూరగాయలు వంటి పంటల వైపు రైతులను మళ్లించాలని అందుకు రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించి అన్ని పంటలకు బీమా చేయించాలని తెలిపారు. వనపర్తిలో కూరగాయలు నర్సరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదేవిధంగా వచ్చే హరితహారం కోసం సన్నద్ధం కావాలని సూచించారు. అధికారులు తమ వద్ద ఉన్న వనరులతో రైతులకు మేలు చేయాలని సమస్యలను ప్రజాప్రతినిధుల, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. జడ్పీ సీఈవో యాదయ్య, జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, పెద్దమందడి జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, ఆత్మకూరు జడ్పీటీసీ శివరంజని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, ఉద్యానవన జిల్లా అధికారి సురేష్, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప,పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, భూగర్భ జలాలు అధికారి మోహన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అమోల్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా

- అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా
- ఒక టిప్పర్‌కు అనుమతితో పదుల సంఖ్యలో తరలింపు
- దుందుభీ నుంచి రోజుకు 30 నుంచి 50 టిప్పర్లలో తరలుతున్న ఇసుక
- ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నా పట్టించుకోని అధికారులు


పొల్కూరు వద్ద నిల్వ చేసిన ఇసుక


డంప్ చేసిన ఇసుకను హిటాచీ ద్వారా టిప్పర్‌లోకి నింపుతున్న వ్యాపారులు

నాగర్‌కర్నూల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ నది పరివాహక ప్రాంతంలో కంటికి రెప్పలా కాపాడుకున్న ఇసుక మేటలను కళ్ల ఎదుటే కొల్లగొడుతుంటే నిలువరించలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లడం పరివాహక ప్రాంత ప్రజలను కలవరపెడుతున్నది. అనుమతుల పేరిట ఇసుక దోపిడీ కొనసాగుతుండడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. రోజుకు పదుల సంఖ్యలో భారీ టిప్పర్లు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు మౌనం దాల్చడం వెనక అంతర్యమేమిటో బోధపడడం లేదు. తాడూరు మండలం మేడిపూర్, పొల్కూరు, గుట్టలపల్లి ప్రాంతాల్లో రోజుకు టిప్పర్లల్లో ఇసుక దోపిడీ కొనసాగుతున్నది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్న దుందుభీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలివెళ్తున్నా ఎవరూ పట్టించుకునే పాపాన పోవడం లేదంటూ పొల్కూరు, మేడిపూర్ గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మైనింగ్ ఆదాయానికి గండి

ఇసుక అక్రమ రవాణాతో మైనింగ్ శాఖ లక్షల రూపాయలు నష్టపోతున్నా అధికారులు నోరు మెదపకపోవడం వెనుక అంతర్యమేమిటో బోధపడడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శ్యాండ్ టాక్సీ వాహనాలు నడపవల్సి ఉంటుంది. ఇసుక ఎవరికి అవసరం ఉంటే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ ద్వారా అనుమతి పొందాలి. అనుమతి పొందిన పత్రంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న అధికారికి అనుమతి పత్రం చూపించి ఇసుకను ట్రాక్టర్లలో తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం పొల్కూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వద్ద భిన్నమైన పరిస్థితి కన్పిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి వారు ఇసుకను అక్రమంగా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దుందుభీ నదిలోకి ప్రత్యేకంగా రోడ్లు వేసి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దుందుభీ నదిలో నుంచి బయటకు ప్రతీరోజు భారీ టిప్పర్లలో దాదాపు 500 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా రవాణా అవుతుంది. జిల్లాలోనే కాక జిల్లా సరిహద్దులను కూడా దాటిస్తున్నట్లు సమాచారం. దుందుభీ పరివాహక ప్రాంతంలో కల్వకుర్తి మండలం గుండూరు, లింగసానిపల్లితో పాటుగా తాడూరు మండలంలోని మేడిపూర్, పొల్కూరు గ్రామాల్లో ఇసుక డంప్‌లు ఉన్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఉప్పునుంతల మండలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.


ఇసుక లోడ్‌తో టిప్పర్లు తిరగడంతో పగిలిపోయిన బీటీ రోడ్డు

జాతీయ రహదారి పేరిట కొనసాగుతున్న అక్రమాలు

మేడిపూర్ గ్రామం వద్ద కల్వకుర్తి నంద్యాల జాతీయరహదారికి సంబంధించి దుందుభీ నది వద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణ పనులు నడుస్తున్నాయి. ఈ పనులకు ఇసుక అవసరం ఉన్న సందర్భంలో ప్రభుత్వం వాడుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇదే ఇసుక దోపిడీ దారులకు వరంగా మారింది. దీనిని సాకుగా చూపి రాత్రి పగలు తేడా లేకుండా తోడేళ్లలా ఇసుకను తోడేస్తున్నారు. కొన్నిసార్లు గ్రామస్థులు టిప్పర్లను అడ్డుకున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. అదేవిధంగా దుందుభీ నది పరివాహక ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా వాహనాలు చక్కర్లు కొడుతుండడంతో మేడిపూర్, పొల్కూరు, గుట్టలపల్లి ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. భారీ టిప్పర్లను మైనర్లు నడుపుతున్నప్పటికీ రోడ్డు రవాణా శాఖకు చెందిన అధికారులు మౌనంగా ఉండటం విశేషం.

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్ చౌరస్తా, జూన్ 6: ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, వానాకాలం పంట సాగుపై గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు, అభ్యర్థులకు ఫ్రిస్కింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోకి తీసుకురావడానికి అనుమతి లేదని, జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచేవిధంగా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. పరీక్షల ప్రధాన పరిశీలకునికి తప్ప ఏ ఒక్కరూ పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్‌తో వెళ్లడానికి వీలు లేదని తెలిపారు. వనపర్తి జిల్లాలో అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. రైతులకు నకిలీ విత్తనాలపై అప్రమత్తత , వ్యవసాయ మెలకువలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. వీసీలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, ఆర్డీవో పద్మావతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు

» మన్ననూరులో నిరుపయోగంగా ఈ హెల్త్, డయాగ్నోస్టిక్ కేంద్రం



మన్ననూరులో వృథాగా ఉన్న డయాగ్నోస్టిక్ కేంద్రం భవనం

మన్ననూర్, జూన్ 6 : లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్యకేంద్రం, డయాగ్నోస్టిక్ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన భవనం వృథాగా మారి నిరుపయోగంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన మారుమూల ఏజెన్సీ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆదివాసీ చెంచు గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వాలు సుమారు రూ.40లక్షలతో నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రం, వ్యాధినిర్ధారణ పరీక్షల నిమిత్తం ఏర్పాటు చేసిన భవనం ప్రారంభానికే పరిమితమయ్యాయి. గత 10ఏళ్ల క్రితం ఏజన్సీ పరిధిలో గల మన్ననూరు, లింగాల పీహెచ్‌సీల్లో టెలీమెడిసిన్ సేవల నిమిత్తం ఈ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే కొంత మంది ఆరోగ్య సిబ్బందికి అంత ర్జాలంలో రోగికి అత్యవసర పరిస్థితిలో టెలీ మెడిసిన్ విధానంలో రోగికి ఎలా చికిత్స నిర్వహించాలి అనే విషయంపై శిక్షణ ఇచ్చారు. కానీ వాటికి కావాల్సిన సామగ్రిని సమకూర్చకుండా గాలికి వదిలేశారు. ప్రస్తుతం ఈ ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీలో ఉండే మందుల నిలువ చేసేందుకు ఉపయోగిస్తున్నారు. కానీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగులకు టెలీమెడిసిన్ సేవలు అందుబాటులో లేకుండా పోయింది. ఇదే క్రమంలో నల్లమల లోతట్టు ప్రాంతాల్లో ఉండే చెంచు గిరిజనులకు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, పసిరికలు, మధుమేహం, హిమోగ్లోబిన్, థైరాయిడ్ వంటి పరీక్షలను మన్ననూరులోనే నిర్వహించి వ్యాధినిర్ధారణ చేసేందు కోసం రూ.30 లక్షలతో డయాలసిస్ కేంద్రం కోసం భవన నిర్మాణాన్ని చేపట్టి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్ భవనాన్ని ప్రారంభించారు. పరికరాలు, సిబ్బందిని ఏర్పాటు చేయలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ఏరియాల్లో డయాగ్నోస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించగా వాటిలో మన్ననూరు డయాగ్నోస్టిక్ సెంటర్ పేరు ఉంది. కానీ అధికారులు ఇట్టి కేంద్రానికి లాబొరేటరీ సామగ్రిని సమకూర్చకుండా, జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాల ఆసుపత్రిలోనే డయాగ్నోస్టిక్ కేంద్రం నిర్వహిస్తున్నారు. నల్లమల గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే దూరాభారం పెరిగింది. స్థానికంగా ఉండే ప్రైవేటు ల్యాబ్‌లలో డబ్బులు వెచ్చించి పరీక్షలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి నల్లమలలో మన్ననూరులోని ఈ ఆరోగ్య కేంద్రం, డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నల్లమల ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

ప్రైవేట్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుంటున్నాం



ప్రైవేటు ల్యాబ్‌ల్లో డబ్బులు వెచ్చించి పరీక్షలు చేయించుకుంటున్నాం. మన్న నూరులో మలేరియా, టైఫాయిడ్, షుగర్ వంటి టెస్టులు ప్రభుత్వ దవాఖానాలో ఈ టెస్టులు చేస్తే మాకు సౌకర్యంగా ఉంటుంది.

- తోకల ఈదమ్మ

అచ్చంపేటకు రెఫర్ చేస్తున్నారు..



తమకు అత్యవసర పరిస్థితుల్లో మన్ననూరు పీహెచ్‌సీకి వస్తే అంబులెన్సులో అచ్చంపేటకు రెఫర్ చేస్తున్నారు. ఇక్కడే వైద్య పరీక్షలు నిర్వహించే సౌకర్యం కల్పించాలి.

- నిమ్మల లింగయ్య, భౌరాపూర్ పెంట



స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

ఘనంగా కేవీకే స్థాపన స్వర్ణోత్సవాలు

బిజినేపల్లి, జూన్ 6 : కృషి విజ్ఞాన కేంద్రాలను స్థాపించి 50 వసంతాలు పూర్తి కావడంతో స్వర్ణోత్సవా లను ఘనంగా నిర్వహించినట్లు ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని ఆర్ఏ ఆర్ఎస్‌లోని ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన స్వర్ణోత్సవ సభలో ఆయన మాట్లాడారు. పాండి చ్చేరిలో 1974 మార్చి 21న దేశంలో మొదటి కృషి విజ్ఞాన కేంద్రాన్ని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింద న్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసి మారుతున్న వ్యవసాయ రంగ విస్తరణ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్న తెలిపారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, కేవీకే, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పాగుంట వెంకన్న కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కేటీదొడ్డి, జూన్ 6 : అమావాస్య సందర్భంగా కేటీదొడ్డి మండలం, వెంకటాపురం సమీపంలో ని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురు వారం నిర్వహించిన కల్యాణోత్సవం వైభవంగా కొనసా గింది. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్ర హాలకు అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం అర్చకు లు, భక్తులు ఉత్సవమూర్తులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ మూ ర్తులను ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేదికపై ఉంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేడుకను తిలకించడానికి తెలంగాణ, కర్ణాటక రా ష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమి టీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమం లో శేషిరెడ్డి, గోపి, పద్మారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

వచ్చేనెల 3 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

▸▸ పాల్గొననున్న తెలంగాణ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ▸▸ ఎండీబీఏ అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 6 : మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం లో వచ్చేనెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మిం టన్ టోర్నీ నిర్వహించనున్నామని మహబూబ్‌నగ ర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేష న్ ఆధ్వర్యంలో మొదటిసారి రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వహణకు రాష్ట్ర సంఘం అవకాశం ఇచ్చిందన్నా రు. గతంలో జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం లేకపోవడం వల్ల రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వహించ లేకపోయామన్నారు. మాజీ క్రీడా శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ హయాంలో జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం జరిగిందన్నారు. అసో సియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వ హించుకునేందుకు అవకాశం లభించిందన్నారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, 15 మంది ఆఫిషియల్స్ పా ల్గొంటారని తెలిపారు. మూడో తేదీన క్వాలిఫై యింగ్ రౌండ్, నాలుగు నుంచి ఆరో తేదీ వరకు డబుల్స్, సింగిల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయని వివరించారు. క్రీడాకారుల కు వసతి, భోజన సౌక ర్యం కల్పిస్తున్నట్లు తెలి పారు. టోర్నీ ప్రారంభోత్స వానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతిని ధి, రాష్ట్ర క్రీడా వ్యవహారా ల శాఖ సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ హాజ రుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగా ణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షు డు మహ్మద్‌హమెద్‌అలీ, జీ.శివప్రసాద్, ఎంపీ. ప్రవీణ్‌కుమార్, ఈసీ మెంబర్ సతీష్‌జోసెఫ్, భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీబీఏ అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్ గౌడ్

ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు

▸▸ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ఉండవల్లి, జూన్ 6 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని భైరాపురంలోనీ బీసీ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో, వీధుల్లో మోకాలిలోతు వర్షపు నీరు నిలుస్తోందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజాదర్బార్ లో చేసిన ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. గ్రామస్థులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారి కన్నా దిగువన బీసీ కాలనీ ఉంది. కాలనీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో ప్రతీ వర్షాకాలంలో కాలనీలో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను సమస్యను ప రిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో కాలనీకి చెందిన గురురాజ్ గత ఏడాది డిసెంబర్ 11న హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత వరుసగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకోలే దు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో ఎంపీవో పద్మావతి బీసీ కాలనీలో పర్యటించి, సమస్యను తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్డు ఎత్తు పెంచడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు.



భైరాపురం బీసీ కాలనీలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎంపీవో

మా కాలనీకి సీసీ రోడ్డు వేయండి

▸▸ బురద నీటిలో కూర్చొని నిరసన



నాగర్‌కర్నూల్‌లోని 17వ వార్డులో బురద నీటిలో కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6: జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో గురువా రం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కాలనీలోని రాడ్లన్నీ జలమయమై చిత్తడిగా మారాయి. కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షానికి గోతుల్లో వ ర్షపు నీరు నిలిచిపోయి ద్విచక్ర వాహనదారులు సైతం రాకపోకలకు ఇబ్బంది గా మారింది. బీజేపీ బూత్ అధ్యక్షుడు బాలరాజు కాలనీవాసులతో కలిసి బురద నీటిలో కూర్చొని సీసీ రోడ్లు వేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి 17వ వార్డును దత్తత తీసుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేసి సీసీ రోడ్డు వేయకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చామని, సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినా నేటికి ఆచరణలో పెట్టలేదని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులు స్పందిం చి కాలనీలో సీసీ రోడ్డు వేసి, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగిం చాలని కోరారు. లేని పక్షంలో కాలనీవాసులతో కలిసి నిరాహార దీక్షకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

అడవి నుంచి వచ్చిన చుక్కల దుప్పి

▸▸ పట్టుకొని అటవీ శాఖ అధికారులకు అప్పగింత

అమ్రాబాద్, జూన్ 6: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే తిరుమలాపూర్ అటవీ ప్రాంతం నుంచి చెదిరి వచ్చిన ఒక చుక్కల దుప్పిని గ్రామస్థులు పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించిన సంఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఒక చుక్కల దుప్పి చెదిరిపోయి గ్రామంలోకి రావడంతో ఊర కుక్కలు వెంబ డించాయి. దీంతో పరుగెత్తుకొంటూ వచ్చి ఊరు చివర ఉన్న ఓ ఇంటిదగ్గర నిలిచిపోయింది. వెంటనే గ్రామస్థులు స్థానిక అటవీ అధికారులకు సమాచా రం అందించారు. డీఆర్‌వో లక్ష్మీకాంత్, బీట్ ఆఫీసర్ గోపాల్ తదితరులు అక్కడికి చేరుకొని స్వల్పంగా గాయపడిన దుప్పికి ప్రథమ చికిత్స అందిం చారు. ఆ తర్వాత ఆరోగ్యంగానే ఉందని నిర్ధారించుకొని చుక్కల దుప్పిని ఆ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోనే వదిలి పెట్టినట్లు అమ్రాబాద్ అటవీ రెంజ్ అధికారి అదిత్య విలేకరులకు తెలిపారు.



బీకే తిరుమలాపూర్ గ్రామంలోకి వచ్చిన చుక్కల దుప్పి

చెరువులు, కుంటల్లోకి చేరిన వర్షపు నీరు



అమ్రాబాద్ సమీపంలోని లోకేశ్వరం చెరువులోకి చేరిన వర్షపు నీరు

అమ్రాబాద్, జూన్ 6 : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం రా త్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షం కా రణంగా చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఈ ప్రాంతంలో చెదురు ముదురు వర్షాలు కురుస్తుండ డంతో రైతులు పత్తి, కంది, జొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో ఇటీవల కురిసిన వర్షానికి విత్తుకున్న రైతుల పత్తి విత్తనాలపై మట్టి పేరుకుపోయి మొలిచే అవకాశం లేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాజీ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వనపర్తి అర్బన్, జూన్ 6: వనపర్తి పట్టణ సమీపంలోని పీర్లగుట్టలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసు లు కోరారు. గురువారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇచ్చారు. కానీ, విద్యుత్ సమస్యతో పాటు , మంచినీటి సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలు ఉన్నాయన్నారు. మాజీ మంత్రి స్పందిస్తూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు నాగమ్మ, సుజాత, అరుణ, వజ్రాల రమేష్ తదితరులున్నారు.

'కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేయిస్తా'

పెద్దమందడి, జూన్ 6: ఇచ్చిన మాట ప్రకారం వేంకటేశ్వర దేవాలయ ఆవరణంలో కల్యాణ మండప నిర్మాణం పూర్తి చేయిస్తానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మద్దిగట్ల గ్రామంలో వేంకటేశ్వర స్వామి గుడి దగ్గర కల్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారంగా తన తల్లి తారకమ్మ పేరు మీద కల్యాణ మండపం నిర్మిస్తానని హామీ ఇచ్చానని, చెప్పిన మాట ప్రకారం త్వరగా పూర్తి చేయిస్తానన్నారు. అంతకుముందు ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దమందడి జడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, నాయకులు రామేశ్వర్‌రెడ్డి, గట్టు సతీష్, వేణుయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విమర్శలు మాని చేతనైతే అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్

వనపర్తి అర్బన్, జూన్ 6: ఎమ్మెల్యే మేఘారెడ్డి విమర్శలు మాని చేతనైతే అభివృద్ధి పనులు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యంతోనే బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ లక్షలాది ఓట్లు సాధిస్తే, బీజేపీతో కుమ్మక్కైందని అనడం ఎమ్మెల్యే అవివేకానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో ఎమ్మెల్యే హుందాతనాన్ని కాపాడుకోవాలని, కానీ పొద్దున లేస్తే ప్రతిపక్ష పార్టీలతో పాటు సొంత పార్టీలోని ఓ వర్గంపైనే దుమ్మెత్తిపోస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేకు దమ్ముంటే చిన్నారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి కంటే నిరంజన్‌రెడ్డి ఎక్కువ అభివృద్ధి చేసి చూపించారని అంతకుమించి అభివృద్ధి చేసి చూపించాలని సవాల్ విసిరారు. ఇకనైనా విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

ప్రతీ చిన్నారికి టీకా వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌వో రామయ్య

పాన్‌గల్, జూన్ 6: ప్రతీ చిన్నారికి టీకాలు వేసి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కాపాడాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే సందర్భంగా వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలతో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు మైథిలి, నాగరాజుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతీ బిడ్డకు సమయానుకూలంగా సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు వేసి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కాపాడాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే గర్భిణులు కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, సతీష్, మదన్ గోపాల్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరీశ్

వీపనగండ్ల, జూన్6: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు డాక్టర్ హరీశ్ గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి ఎక్కువగా పోషకాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు తెలిపారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్వప్న, అంగన్వాడి టీచర్లు సుగుణబాయి, ఎల్లమ్మ, ఆయాలు ఈశ్వరమ్మ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు దైవభక్తి ఉండాలి



బహుమతులు సర్టిఫికెట్లు అందుకున్న సమ్మర్ క్యాంపు విద్యార్థులు

అమరచింత, జూన్6: నేటి విద్యార్థులకు చదువుతోపాటు దైవభక్తి తోడైతేనే వారు ఉన్నత శిఖరాలకు అవరోధిస్తారని కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన మౌలానా మీర్జా కైరుల్లా అన్నారు. అమరచింత జామియా మసీదులో రెండు నెలల పాటు దారుల్ ఉలూమ్ మినాజ్ సాలిహీన్ ఆధ్వర్యంలో కొనసాగిన విద్యార్థుల ఉర్దూ బేసిక్‌పై జరిగిన సమ్మర్ క్యాంపు ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు సామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఇంగ్లిష్, ఉర్దూ చదువులు, నమాజ్ పద్ధతులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మౌలానా అల్తాఫ్ బేగ్, రెహమాన్, ఆఫీస్, ఫరీద్, ఖాజా ఫరీద్, అన్సర్, కాసీం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 6: ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే వేతనాలు అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, గోపాలకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, కురుమయ్య, కొండన్న పాల్గొన్నారు.

అడకత్తెరలో కార్మికులు

- అధికారులు, కాంట్రాక్టర్ మధ్య నలిగిపోతున్న కార్మికులు
- వేతనాలకు బిక్కుబిక్కుమంటూ ఎదురు చూపులు
- విచారణ పేరుతో మూడు నెలలుగా నిలిపివేత
- కలెక్టర్ చొరవ తీసుకుంటేనే ఆస్పత్రి కార్మికులకు న్యాయం

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 6: జిల్లా జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికుల పరిస్థితి అడకత్తెరలో పడ్డ పోకలా మారింది. ఒక వైపు జిల్లా ఆస్పత్రి అధికారులు, మరో వైపు ఆస్పత్రి ఏజెన్సీ నిర్వహకుల మధ్య కార్మికులు నలిగిపోతున్నారు. దారిద్రరేఖకు దిగువలో ఉండే అత్యధిక పేదలే ఆస్పత్రిలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నా రు. అలాంటి కార్మికులకు మాత్రం అధికారులు, ఏజెన్సీ నిర్వాహకుల నుంచి ఆశించిన స్థాయిలో సహకారాలు అందడం లేదు. బడ్జెట్ ఉన్నా కూడా గడిచిన మూడు మాసాలుగా వేతనాలు అందడం లేదు.

ఆశగా ఎదురుచూపులు...

ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ విధానంతో ప్రభుత్వాలు ముందుకు వెళ్తున్నాయి. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్వహణకు అంబియన్స్ ఏజెన్సీ ముందుకొచ్చింది. ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్స్ కార్మికులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏజెన్సీ వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయడం ఆలస్యం అయితే సదరు ఏజెన్సీ కాంట్రాక్టర్ మూడు నెలల పాటు కార్మికులకు వేతనాలు చెల్లించాల్సిన నిబంధన కూడా ఉంది. కానీ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ మాసం వరకు ముందస్తు వేతన బడ్జెట్ విడుదల చేసింది. అయినా కార్మికులకు మాత్రం వేతనాలు అందని ద్రాక్షగానే మిగలడంతో కార్మికులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. తమకు వేతనాలు ఎప్పుడు వస్తాయోనన్ని దిగులుతో ఆశగా చూస్తున్నారు.



వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

విచారణ పేరుతో....

సదరు కాంట్రాక్ట్ ఏజెన్సీ నిర్వాహకులు కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల్లో, జీపీఎఫ్, ఈఎస్ఐలలో అక్రమాలకు పాల్పడ్డారని కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆస్పత్రి ఏజెన్సీ చేసిన అవకతవకలపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ అధికారులు ఇదే అదునుగా భావించి విచారణ పేరుతో కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను నిలిపేశారు. వేతనాల చెల్లింపు కోసం సంతకం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన మార్చి, ఏప్రిల్, మే మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు అందడం లేదు. ఒకవేళ అధికారులు వేతనాల చెల్లింపు కోసం సంతకం చేసినట్లైయితే కార్మికులకు ఏ ఆటంకం లేకుండా జూలై వరకు ప్రతీ నెల వేతనాలు వచ్చే అవకాశం ఉన్నది. కార్మికులు మాత్రం ఒక పక్క త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కాబోతుండటం, మరో పక్క కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తుందని కొందరు కార్మికులు కంటతడి పెట్టుకుంటున్నారు. కలెక్టర్ విచారణ చేయమన్నాడే కానీ వేతనాలు చెల్లించడం ఆపాలని ఎక్కడా ఆదేశించి దాఖలాలు లేనట్లు తెలుస్తోంది.

కార్మికులకు అన్యాయం జరుగకూడదనే...



ఆస్పత్రిలో పని చేస్తున్న ఏ ఒక్క కార్మికుడికి అన్యాయం జరుగకూడదనే ప్రయత్నిస్తున్నాం. కార్మికుల నియామకాలు, వేతన చెల్లింపులు, పీఎఫ్, ఈఎస్ఐ జమ విషయంలో కార్మికులు ఇచ్చిన ఫిర్యాదుతో కలెక్టర్ ఆదేశాల మేరకే కాంట్రాక్టర్ అవినీతిపై విచారణ చేస్తున్నాం. మరో వారం రోజుల్లో విచారణ పూర్తి అవుతుంది. అనంతరం కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం. కలెక్టర్ ఆదేశాలతో కార్మికులకు న్యాయం చేయడం కోసమే అందరం తాపత్రయ పడుతున్నాం.

- డాక్టర్ రవిశంకర్, జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవో, వనపర్తి

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

- నైవేద్యం సమర్పించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి
- ఆయా ఆలయాల్లో భక్తులు పూజలు

వనపర్తి రూరల్,జూన్ 6: వనపర్తి మండల పరిధిలోని తిరుమలాయగుట్ట సమీపంలో గల శ్రీ ఆంజనేయ స్వామికి గురువారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి వనపర్తి జిల్లా పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని వారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం పెద్దగూడెం గ్రామస్థులు విష్ణువర్ధన్ రెడ్డి, సునీత కుటుంబం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తిరుమల య్య గుట్ట పైన ఉన్న వేంకటేశ్వర స్వామిని దర్శిం చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు లక్కాకుల సతీష్, చీర్ల విజయ చందర్, వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, కృష్ణబాబు, రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంచముఖి ఆంజనేయ స్వామికి పూజలు

వనపర్తి మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ శివారులో పంచముఖి ఆం జనేయ స్వామికి గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తకోట వాస్తవ్యులు చంద్రశేఖర దర్మపత్ని భవ్య శ్రీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిద్ధాంతి నవీన్ శర్మ, గురుస్వామి నరేందర్, మాజీ సర్పంచ్



వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

శారద ఆశన్న నాయుడు, సింగిల్‌విండో డైరెక్టర్ శివశంకర్ రెడ్డి, పార్థసారథి గౌడ్, కృష్ణయ్య , ముమ్మల శ్రీనివాసులు, నీలయ్య, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున్ , శేఖర్, మహేష్ , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనలింగేశ్వర ఆలయంలో..

ఖిల్లాఘణపురం: మండల కేంద్రంలోని ఘన లింగేశ్వర భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో గురువారం అమా వాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు అఖండ భజనలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణం లో దాతల సహకారంతో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వ హించారు.

ఆది బసవయ్య ఆలయంలో..

శ్రీరంగాపురం: శ్రీరంగాపురం సమీపంలోని ఆది బసవయ్య ఆలయంలో అమావాస్య సందర్భంగా పూజలు నిర్వహించారు. పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన రమేష్‌గౌడ్ ప్రత్యూష దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, అధ్యక్షుడు ఆంజనేయులు, రవియాదవ్, గంగాధర్‌యాదవ్, సతీష్, క్రాంతి, రాముడు, శివ తదితరులు పాల్గొన్నారు.

శివ చౌడేశ్వరి ఆలయంలో..

అమరచింత: అమరచింత, సింగంపేట, చంద్రఘడ్, నందిమల్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరచింత బీసీ కాలనీలో వేంకటేశ్వర ఆలయం, తిరుమల వీధిలో గల శివ చౌడేశ్వరి ఆలయంలో నిర్వాహకులు అన్నదానం చేశారు. అలాగే ఆయా గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు

వనపర్తి టౌన్, జూన్ 6: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మర్రికుంట సమీపంలో ఉపాధి కూలీలు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు, దేవన్న, వెంకటయ్య, ప్రసాద్, శంకర్, శంకరయ్య, నిరంజన్, అలివేల తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఉపాధి కూలీలకు తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు హనుమంత్ కోరారు. గురువారం గ్రామాల కూలీలు ఏపీవో విజయ భాస్కర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే కొంతమంది కూలీలకు ఈకేవైసీ లేనందున వేతనాలు అకౌంట్లో జమ కావడం లేదని, తక్షణమే పోస్టల్ అధికారులు స్పందించి ఈకేవైసీ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్, సామేల్, ఆయా గ్రామాల కూలీలు శాంత, సుజాత, పోలన్న, చంద్రకళ, మల్లేశ్వరి పాల్గొన్నారు.



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి కూలీలు

ప్రశాంతంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు

- నేడు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక

వీపనగండ్ల, జూన్ 6: మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో గురు వారం నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం తొమ్మిదిమంది డైరెక్టర్లకు గాను బుడ్డమ్మ, గంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఏడు డైరెక్టర్లకు ఎనిమిది మంది పోటీ పడ్డారు. సంఘంలో 253 మంది ఓటర్లు ఉండగా 234మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తరువాత ఓట్ల లెక్కింపు నిర్వహించగా చాపల సాయి బాబు, కనుకలి నరసింహ, ఈదన్న, ఎస్. వెంకటయ్య, నక్క వెంకటయ్య, మౌలాలి, కురుమూర్తి గెలుపొందారు. గోపాల్ ఓటమి పాలైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు ప్రకటించారు. గెలుపొందిన వారు శుక్రవారం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటారన్నారు.

'సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించాలి'

చిన్నంబావి జూన్6: లక్ష్మీపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్ రెడ్డి దారుణ హత్య జరిగి 15 రోజులు అవుతున్నా పోలీసు అధికారులు ఇంత వరకు నిందితులను గుర్తించలేదని జడ్పీటీసీ సభ్యురాలు కేసీరెడ్డి వెంకటరమణమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీపీ తిమ్మిరెడ్డి సోమేశ్వరమ్మతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హత్య కేసులో అసలు నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించాలని ఆమె కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కేసిరెడ్డి చిన్నారెడ్డి, జయగౌడ్, రామస్వామి, శివ పాల్గొన్నారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

- రేవల్లి ఎంఈవో శ్రీనివాస్ గౌడ్



కొత్తకోట మండల పాలెం గ్రామంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రేవల్లి, జూన్ 6: బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడం మనందరి బాధ్యత అని మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శంకర్ నాయక్ బడిబాట కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అంతా కలిసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా చూడాలన్నారు. బడిబాట కార్యక్రమం ఈనెల 19వరకు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీవో హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● ఖిల్లాఘణపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యమని ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట లక్ష్యమని ఎంపీడీవో వెంకటాచారి తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులకు బడిబాటపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో ఉషారాణి, ఎంపీవో రాజు, ఏపీఎం రాంబాబు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మదనాపురం: మండలంలోని దుప్పల్లి పాఠశాలలో హెచ్ఎం మూలే ఆంజనేయులు ఆధ్వర్యంలో బడిబాట ప్రతిజ్ఞ చేశారు. సమావే శంలో ఉపాధ్యాయులు బాలరాజు, ఆంజనేయు లు, దయానంద్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుధామణి పాల్గొన్నారు.

● గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి, నర్సింగాయిపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాలుర హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్, ఉ పాధ్యాయులు, రాందేవ్‌రెడ్డి, శేషయ్య, హమీద్, నాగరాజు, సునీత, దేవి పాల్గొన్నారు.

● పాన్‌గల్ : మండల పరిధిలోని దవాజిపల్లి, దవాజిపల్లి తండా, తెల్లరాళ్లపల్లి తండాలో ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భద్రు, బిచ్యానాయక్, మాజీ సర్పంచులు వెంకటయ్యయాదవ్, శాంతమ్మ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రా ములు, ఆస్మనాజ్, సీఆర్పీలు గోవిందునాయక్, భార్గవి, రమాదేవి, ఐఆర్పీ సంతోష్, అంగన్‌వాడీలు టీచర్లు పాల్గొన్నారు.

● అమరచింత: మండలంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాల్లో మహిళా సమాఖ్య సభ్యులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు తల్లిదండ్రులు, పంచాయతీ సెక్రటరీలు, మునిసిపాలిటీలోని అధికారులతో ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్ సింగ్ ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులు , అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● కొత్తకోట : మండలంలోని ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటిం టికి తిరుగుతూ పిల్లల వివరాలు సేకరించారు. పాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఏపీఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు

మదనాపురం, జూన్ 6: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

వృథా అవుతున్న తాగునీరు



వాల్వ్ దగ్గర లీక్ అవుతున్న తాగునీరు

రేవల్లి, జూన్ 6: మండలంలోని గౌరీదేవిపల్లి గ్రామం నుంచి భగీరథ వాటర్ పైపులైన్ రేవల్లి, గోపాల్‌పేట మండల కేంద్రాల మీదుగా కొత్తకోట, కానాయపల్లి వరకు తాగునీరు అందించడానికి ఏర్పాటు చేశారు. మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో పైపులైన్‌కు రంధ్రం ఏర్పడి కొద్ది రోజులుగా తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైపు లైన్‌కు మరమ్మతులు చేసి తాగునీరు వృథా కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారి శివ రాజును వివరణ కోరగా రెండు మూడు రోజుల్లో బాగు చేసి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీరంగాపురం, జూన్ 6: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన టైలర్ కురుమయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం పలువురు మృతదేహానికి నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ వర్కింగ్ మండల ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, వాహిదిన్, ఆశన్నలు ఎమ్మెల్యే తరఫున రూ. 5000 ఆర్థి సాయం అందించారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం తరపున బాధిత కుటుంబానికి రూ. 11వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కురుమయ్య, డాక్టర్ బాలయ్య, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఆత్మకూరు, జూన్6: ఆత్మకూరు పట్టణంలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ కుమార్ దుకాణాల్లోని లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ ఈపాస్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ జయమ్మ, హెడ్ కానిస్టేబుల్ అంజనేయులు పాల్గొన్నారు.

● పెద్దమందడి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైతే ఫర్టిలైజర్ షాపులను సీజ్ చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి సైదులు యాదవ్ హెచ్చరించారు. గురువారం పెద్దమందడి, మోజర్ల గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను కానిస్టేబుల్ శాంతయ్యతో కలిసి తనిఖీ చేశారు.

● చిన్నంబావి, : మండల కేంద్రంలోని ఎరువుల, విత్తనాల దుకాణాలను ఇన్‌చార్జి ఏవో డాకేశ్వర్ గౌడ్, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను అమ్మితే పీడీ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీటీ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నీట్‌లో కార్మికురాలి కూతురి ప్రతిభ

వనపర్తి టౌన్, జూన్ 6: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తున్న ఉష కూతురు ప్రహర్ష నీట్‌లో ప్రతిభ చూపారు. 720 మార్కులకు గాను 457 మార్కులు సాధించింది. ఆస్పత్రి కార్మిక యూనియన్ ఏఐటీయూసీ నాయకుడు సురేష్ గురువారం జిల్లా కేంద్రంలోని ప్రహర్ష సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన ఉష తన కూతురును ఉన్నత ఆశయాలతో చదివిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకుడు రమేష్, పలువురు ఉన్నారు.

● వీపనగండ్ల: వీపనగండ్ల గ్రామానికి చెందిన విద్యార్థులు నీట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటారు. అఖిల్ 720 మార్కులకు గాను 645, యామిని 568, అఖిల 444 మార్కులు సాధించారు. గ్రామంలో ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడంతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గ్రామస్థులు అభినందించారు.